క్లుప్తంగా

యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా..



ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

గోపాలపట్నం: యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. శ్రీకృష్ణ యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నరవ ప్రాంతంలో నిర్వహించిన వనభోజనాలకు ఆనంద్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యాదవుల సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని సామాజిక వర్గాల అభివృద్ధి కట్టుబడి ఉన్నారన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. యాదవ సంఘం నాయకులు ఆనంద్‌కుమార్‌కు మద్దతు తెలిపారు.

ఘనంగా హనుమత్ వ్రతం



ఆనంద్‌కుమార్‌కు ప్రసాదం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

మల్కాపురం: జింక్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి వేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత యామినిరెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని గోపాలపట్నంకు చెందిన ఎస్. యామినిరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో భ్రమరాంబ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన



దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: శ్రీహరిపురం పిలకవానిపాలెంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లక్కీ అమర్ స్కూల్, వందే భారత్ బ్లడ్ సెంటర్ క్యాంప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల నుంచి 267 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, జిప్స ప్రెసిడెంట్ భాస్కరరావు, వందే భారత్ బిల్డ్ సెంటర్ ప్రతినిధి వినోద్‌బాబు, మదర్ థెరిస్సా ట్రస్ట్ ఫౌండర్ జాగరపు శ్రీను, గంధం సాయి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆరోగ్య భాగ్యం

ఇది కదా అభివృద్ధి

నాడు

పేద కుటుంబాల వారికి అనారోగ్యం తలెత్తితే అంతే సంగతులు. ప్రైవేటు వైద్యుడిని ఆశ్రయించడమే శరణ్యం. లేక పోతే నగరంలోని కేజీహెచ్‌కు వెళ్లాల్సిందే... ఇక సామాన్య, మధ్య తరగతి వారైతే అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడమే మార్గం.

నేడు

పరిస్థితి పూర్తిగా మారింది. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం చేరువైంది. ఎవరికి అనారోగ్య సమస్య తలెత్తినా నడిచి వెళ్లి వైద్య సేవలు పొందాలనే లక్ష్యంతో ప్రజలకు చేరువగా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోంది.

- 89వ వార్డులో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం
- పెరిగిన రోగుల తాకిడి
- రోజుకు 50 మంది వరకు సేవలు
- కష్టాలు తీరాయంటున్న స్థానికులు

గోపాలపట్నం: పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో యల్లపువానికి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని రూ1.76కోట్ల వ్యయంతో నిర్మించారు. దీంతో దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు తొలగనట్లయింది. అవసరమైన వసతులతో పాటు వైద్యులు, సిబ్బంది, నాణ్యమైన మందులు అందుబాటులోకి తెచ్చారు. దీంతో తమ వైద్యానికి భరోసా లభించిందని పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నుంచి...

అత్యవసరమైతే అంబులెన్స్ కూడా కొత్తపాలెం ప్రాంతంలోకి వెళ్లేందుకు అవకాశం లేదు. ఇక్కడి రైల్వే అండర్‌పాస్ నుంచి భారీ వాహనాలు, అంబులెన్సుల రాకపోకలకు అవకాశం లేదు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కార్లు, ఆటోలను ఆశ్రయించాల్సిందే.. ప్రథమ చికిత్స కూడా అందించేందుకు ఎవరూ లేని దుస్థితి ఉండేది. ఇప్పుడు ఆ ప్రాంతంలో ఏకంగా ఆస్పత్రి రావడంతో తమ కష్టాలు తీరాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రిలో వేచి ఉన్న రోగులు

ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండే రోజులు	
సోమవారం	పిల్లల వైద్య నిపుణుడు
మంగళవారం	ఎముకుల వైద్య నిపుణుడు
గురువారం	స్త్రీ వైద్య నిపుణులు

ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 11 గదుల వివరాలు

మందులు ఇచ్చే గది, కుట్లు, కట్లు వేయడంతో పాటు టీకాలు ఇవ్వడానికి ప్రత్యేక గది నిర్మించారు. వీటితో పాటు మినీవార్డు, ఫ్యామిలీ ప్లానింగ్, మెటర్నటీ క్లినిక్, డాక్టర్ గది, స్పెషలిస్ట్ వైద్యుల గది,లేబొరేటరీ, స్టాఫ్ వాష్ రూమ్, ల్యాబ్ వాష్ రూమ్, మీటింగ్ హాలు వంటి సదుపాయాలు ఉన్నాయి.



యల్లపువానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం

యల్లపువాని పాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ప్రాంతం	:	89వ వార్డు, కొత్తపాలెం
నిర్మాణ వ్యయం	:	రూ.1.76 కోట్లు
వసతులు	:	11 గదులు 10 పడకలు అత్యాధునిక సదుపాయాలతో ల్యాబ్ బయో కెమిస్ట్రీ యంత్రం సీబీసీ, ఎలక్ట్రోలైట్
ఓపీ సమయం	:	ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు
ఓపీ సంఖ్య	:	రోజూ 40 - 50 మంది
ప్రధాన వైద్యాధికారి	:	డాక్టర్ వికాశ్



పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



మందులు అందిస్తున్న దృశ్యం

వైద్య సేవలు బాగున్నాయి



ఇక్కడ కొత్తగా ఆస్పత్రి కట్టారని తెలిసివచ్చాను. ఆస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. ఆధార్ కార్డు తీసుకు వస్తే అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తున్నారు. ఇంతక ముందు వైద్యం కోసం గోపాలపట్నం లేదా కేజీహెచ్‌కు వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఆ ఇబ్బంది తీరింది. –హాసిని, ఆదర్శనగర్

ఉచితంగా పరీక్షలు



ఆస్పత్రి ఈ మధ్యే ప్రారంభమైందని ఆశా వర్కర్ ద్వారా తెలుసుకున్నాను.బీపీ,షుగర్ పరీక్షలు చేయించుకోవడానికి వచ్చాను. సిబ్బంది బాగా చూసుకుంటున్నారు. ఏ చిన్న అనుమానం ఉన్నా తీర్చుతున్నారు. కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో వైద్యం ఎక్కడా లేదు. చాలా ఇబ్బందులు పడే వారం. జగన్ మోహన్ రెడ్డి ఇలాంటి ప్రాంతాల్లో ఆస్పత్రి కట్టి మంచి మేలు చేశాడు. –బి దుర్గమ్మ, ఆదర్శనగర్

ప్రజల అవసరాన్ని గుర్తించారు



కొత్తపాలెం ప్రాంతంలో ఉన్న పేదలకు మంచి ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. ఈ మధ్య ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. వైద్యానికి దూరంగా ఉన్న ఈ ప్రాంతంలో మంచి ఆస్పత్రి నిర్మించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి వారికి ఎంతో మేలు చేకూర్చారు. –కె. జానకి, ఖార్వేల్ నగర్

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



మొదట్లో రోజుకు 20 మంది మాత్రమే వచ్చేవారు. ఇక్కడ ఆస్పత్రి ఉందని తెలిసిన తర్వాత తాకిడి బాగా పెరిగింది. రోజుకు 40 నుంచి మంది వరకు సేవలు పొందుతున్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలతో పాటు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. తోటి వారికి ఇక్కడ ఆస్పత్రస్పుందని తెలియజేయాలి. స్పెషలిస్టు వైద్యులు వారంలో మూడు రోజులు వస్తున్నారు. –వికాశ్, వైద్యాధికారి యల్లపువానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం

యువత అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



బ్యాటింగ్ చేస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం : రాష్ట్ర యువత అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ఆదివారం షిప్‌యార్డ్ మైదానంలో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను ఆయన తిలకించారు. క్రీడాకారులను పలకరించి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఆటుపోట్లకు క్రీడలతో చెక్..

సింధియా : జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎదుర్కోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మూడు జిల్లాల ట్రేడ్ యూనియన్ రీజినల్ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ అన్నారు. భావి భారత క్రికెట్ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని షిప్‌యార్డ్‌కాలనీలోని క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను బద్రీనాథ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగం అభివృద్ధిలో భాగంగా పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు అనూహ్య స్పందన లభించిందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల ద్వారా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో 40, 61, 63 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, క్లస్టర్–1 మండల యువజన విభాగం అధ్యక్షులు గంటా వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆధిపత్యం కోసం పోటీ పడుతున్న జట్లు

హోరా హోరీగా మ్యాచ్‌లు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న విశాఖ పశ్చిమ క్రికెట్ లీగ్ పోటీలు నాలుగో రోజు హోరాహోరీగా సాగాయి. ఆదివారం మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో క్రేజీ బాయ్స్ జట్టు ఇండియన్ స్టార్స్‌తో తలపడింది. మొదటి బ్యాటింగ్ చేసిన క్రేజీబాయ్స్ నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేయగా ఇండియన్ స్టార్స్ 9 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసి విజయాన్నందుకున్నారు. అత్యధిక పరరగులు చేసిన కిశోర్ యాదవ్‌కు మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్ అందించారు. రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మిస్టేక్ రేంజర్స్ 9.2 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ అయ్యారు. ముర్రు వాణి వారియర్స్ జట్టు కేవలం 4.2 ఓవర్లకే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించారు. ముర్రు వాణి వారియ్స్ జట్టు బౌలర్ రెండు ఓవర్లలో 6 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. మూడో మ్యాచ్‌లో బీఆర్‌పీ ఎలివెన్స్‌పై ఎన్ఏడీ ఎలివెన్స్ పూర్తి స్థాయి ఆధిపత్యం ప్రదర్శించింది. 76 పరుగుల విజయలక్ష్యాన్ని కేవలం 2.5 ఓవర్లలో చేరుకుంది. ఇందులో శివ కుమార్ బ్యాటింగ్‌లో తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. బీఆర్‌పీ ఎలెవెన్ తొలి బ్యాటింగ్‌లో 11.1 ఓవర్లకు 76 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎన్ఏడీ ఎలెవెన్స్ 2.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. 11 బంతుల్లో 52 పరుగులు చేసిన గుడ్ల శివ మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్ అందుకున్నాడు.



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు

ఆనంద్‌ను కలిసిన కాపు సంఘం నేతలు

గోపాలపట్నం : పద్మనాభనగర్ వద్ద కాపు కల్యాణ మండప నిర్మాణం శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌కు గోపాలపట్నం మండల కాపు సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆయనను డెయిరీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి వదిలేసిన కాపు కల్యాణ మండపాన్ని కొత్తగా రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేయించి, పునః ప్రారంభానికి ఆనంద్‌కుమార్ కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఆయనతో ఇక్కడ నిర్మించిన శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహం ఆవిష్కరింపజేసే అంశంపై చర్చించారు. దీనిపై ఆనంద్‌కుమార్ స్పందిస్తూ ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ, కాపు సంఘం నాయకులు కంపర సత్తిబాబు, కంపర కోటేశ్వరరావు, ఈవీ రమణ, నగేష్, రాజు, తుంపాల బాబూరావు, రాము, సురేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌కుమార్‌తో బెహరా భాస్కరరావు, కాపు సంఘం నాయకులు

క్రిస్మస్ శోభ

- విద్యుత్ కాంతులీనుతున్న చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనల్లో ఆరాధికులు



బాల ఏసు వృత్తాంతాన్ని వివరించేలా...

విశాఖ విద్య: క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలు, మందిరాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకించారు. ఎన్ఏడీ సెంటర్‌లోని సెయింట్ థామస్ చర్చి,యునైటెడ్ క్రైస్ట్ చర్చిలు విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. అదే విధంగా సీఎస్ఐ ఆధ్వర్యంలోని చర్చిల్లో ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. సెయింట్ థామస్ చర్చి ఆవరణలో క్రిస్మస్ ట్రీని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చిలతో పాటు క్రైస్తవులు, విశ్వాసులు తమ ఇళ్లపై క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లను ఏర్పాటు చేసుకున్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ఎన్ఏడీ సెంటర్లోని పలు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిబ్



ప్రార్థనహాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

క్రికెట్, త్రోబాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి గ్రౌండ్‌లో సెయింట్ మదర్ థెరిస్సా మెమోరియల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ పేరిట వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సీనియర్ నాయకుడు యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్–త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌సీఎం విశాఖ చాన్స్‌లర్, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ పోస్టర్ ఆవిష్కరించారు. జనవరి 28 వరకు జరిగే పోటీల్లో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని సుమారు 22 చర్చిలు, 25 విద్యా సంస్థల క్రీడాకారులు పాల్గొంటారని ఫాదర్లు శివం విజయభాస్కర్, ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి, సీహెచ్ విజయకుమార్, బి.ప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాష్, నిఖిలేష్ రాజ్‌కుమార్

ఐకమత్యంతోనే పెన్షన్ సాధన



సనపల బంగారురాజును సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

మర్రిపాలెం: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెన్షనర్లు రోడ్డున పడుతున్నారని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మసేను అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన ఆదివారం మాధవధార తోటల్లో సర్వసభ్య సమావేశం, వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్టు బెర్తులను ముక్కలుగా చేసి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం యోచిస్తోందని, తక్షణమే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పింఛన్‌దారులకు కూడా భవిష్యత్తులో పెన్షన్ లేకుండా చేసేందుకు పోర్టు యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అందరూ కలిసికట్టుగా ఉంటేనే పెన్షన్‌ను సాధించుకోవచ్చన్నారు. పోర్టు ఆస్పత్రి స్థలాన్ని కార్పొరేట్ శక్తులకు చౌకగా అమ్మేస్తున్నారని, దీని వల్ల వైద్యం కార్పొరేట్ శక్తుల చేతికి వెళ్లి తద్వారా పింఛన్‌దారులపై భారం పడుతుందని చెప్పారు. పెన్షనర్లు వీటిని వ్యతిరేకించాలన్నారు. అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడుతున్న యువత

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్ నగర్‌లోని ఎరుసలేమ్ ప్రార్థనా మందిరంలో మెగా యూత్ గ్రాండ్ క్రిస్మస్ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి సిస్టర్ ఏంజిల్ బ్లెస్సీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం యక్త వయస్కులకు కేకు లు పంచి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

➡ ఆర్ఆర్ వెంకటాపురంలో గోపాలపట్నం ప్రాంత విలేకరుల క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డేవిడ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కకరావు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంట్ల శ్రీను బాబు, రామచంద్రరావు, బెహరా ఆస్పత్రి ఎండీ బెహరా రవితేజ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బెహరా భాస్కరరావు